BALAMITRA

# బాలమిత్ర

బాలల సచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: బి.వి.రాధాకృష్ణ

సహాయ సంపాదకుడు: బి.ఆర్. వరదరాజులు

సంపుటి : 43] డిసెంబర్ - 1936 [సంచిక : 1

## జంగిల్ రాజా

రాఘవేంద్ర చరిత్ర ముగిసి ఇపుడు రాఘవేంద్ర మహిమలు - పాఠకుల జీవితంలో జరిగినవి - ప్రచురిస్తున్నాం. 'బాలమిత్ర' లో అన్ని కథల కన్నా. ఇది ఎక్కువగా ఆకర్షిస్తున్నదని పాఠకుల వుత్తరాల ద్వారా తెలుస్తున్నది. మాకు ఆనందంగా వుంది.

'జంగిల్ రాజా' బొమ్మల సీరియల్ పిల్లలకన్నా, పెద్దలనే ఎక్కువగా ఆకర్షింస్తునట్లు తెలియవస్తున్నది. ఇప్పటికి 12 నెలలుగా ప్రచురిస్తున్న ఆ సీరియల్ ను ముగించకుండా ఇంకా 2 సంవత్సరాల వరకూ జరిపించమని పాఠకులు వుత్తరాలు వ్రాస్తున్నారు. వారి కోరిక ప్రకారం 'జంగిల్ రాజా' సీరియల్ ఇంకా ఎక్కువ నెలలు ప్రచురించ గలమని తెలియ చేస్తున్నాం.

—సంపాదకుడు




# శ్రీ రాఘవేంద్ర కవచం

షోడశైరుప చారైశ్చ సంపూజ్య త్రిజగద్గురుమ్ ।
అష్టోత్తర శతాఖ్యాభిరర్చయేత్ కుసుమాదిభిః ॥ 45

త్రిజగములకు గురువైన శ్రీ రాఘవేంద్రస్వామిని షోడశోపచారములతో పూజించవలెను. అష్టోత్తర శతనామములను పలుకుచు పుష్పముల నర్పింపవలెను.

దీప సంయోజ్య విద్యావాన్ సభాసు విజయీభవేత్ ।
రాజ చోర మహావ్యాఘ్ర సర్పనక్రాది పీడనయ్ ॥ 46

విద్యావంతుడైనవాడు బృందావనము చెంత దీపమును వెలిగించినచో సభలలో విజయమును పొందగలడు. అతడు రాజువలన, చోరుల వలన, వ్యాఘ్రాది క్రూరజంతువులవలన, సర్పములవలన, మొసళ్లవలన పీడలేనివాడగును.




నేను మొదటిసారిగా శ్రీ రాఘవేంద్రుని సినిమాలో చూచి, ఆయన మహిమ తెలుసుకున్నాను. ఆరోజు సాయంత్రం టి.వి. లో శ్రీ రాఘవేంద్ర చరిత్ర సినిమా అని పిల్లలద్వారా తెలుసుకుని; "మీ రాఘవేంద్రుడు మహిమగలవాడయితే, మనకు రెండు రోజులనుండి కరెంటు లేదుకదా! ఈ రోజు ఆయన చరిత్ర మనం చూడాలంటే, కరెంటు తెప్పించమనండి!" అని వెక్కిరించాను. అప్పటికి ఆయన గురించి ఏమీ తెలియదు నాకు! విచిత్రం! సరిగ్గా సినిమాకి ఐదు నిమిషాలముందు మాత్రం కరెంటు వచ్చింది! అందరి ఆనందానికి అంతేలేదు మరి! నాకూ ఆనందం, ఆశ్చర్యం - రెండూ కలిగాయి. సినిమాద్వారా అన్నీ చూడగలిగి, తెలుసుకో గలిగాను. అంతే! నెల తిరక్కుండానే - అంటే 1985 డిశెంబర్ 25 ని బలవంతంతో మా వారిని తీసుకుని మా బాబుతోసహా "మంత్రాలయం" వెళ్లాను. మావారు "స్వామిని దర్శించి, రాత్రి అందరితోపాటు మనం కూడా అరుగుల మీదే పడుకుని, మర్నాడు ఉదయం వెళ్లిపోదాం!" అన్నారు. "అలాకాదు; నేను మూడు రోజులు ఖచ్చితంగా ఉందామన్న ఉద్దేశంతో వచ్చాను. హాయిగా మనం


శ్రీమతి జి. రామలక్ష్మి, హైద్రాబాదు.

లాడ్జిలో వుందాం!" అన్నాను. "ఏల్లేదు; నేను చెప్పినట్లు విన్నావంటే, మరో రెండు మూడు పుణ్యక్షేత్రాలు కూడా దర్శించి రావచ్చు - పట్టులో పట్టుగా!" అన్నారు. అదేవిధంగా అయన కోరిక - ఏ లాడ్జి లోనూ - గురువారం మూలంగా - ఖాళీ ల్లేకపోవటంవలన స్వామిదర్శనం అనంతరం అరుగులమీదే గడపవలసి వచ్చింది. "మీ కోరికే నెరవేరింది!" - అంటూ గొణుక్కుంటూ ఆ రాత్రి ఉత్సాహం లేకుండానే గడిపాను.

గురువారం మూలంగా దర్శనం బాగా దొరకలేదు. మర్నాడు బాగా దర్శించి, ఆలయంలోనే చాలాసేపు గడిపి బయలు దేరాలనుకున్నాము. తీరా తెల్లవారేసరికి 'వేళకానివేళ' అన్నట్టుగా అయినప్పటికీ నాకు అడ్డువచ్చింది!! ఇహ చేసేదిలేక లాడ్జిలో ఆ నాలుగు రోజులూ గడిపి వేసాము! నాలుగోరోజు తెల్లవారుజామున కలలో రాఘవేంద్రుడు కనిపించి, "నీ భర్త కోరికే కాదు; 'నాల్గురోజు లుండటానికే వచ్చాను' - అన్న నీ కోరికా తీర్చానా? ఇక ఆలయంలో నన్ను దర్శించి బయలుదేరండి!" అన్నారు.

చటుక్కున లేచి, మా వారిని లేపి కల గురించి చెప్పగా ఆశ్చర్యపోయారు!

మహానందంతో శ్రీ రాఘవేంద్రుని బృందావనం దర్శనం చేసుకుని, ఆయన ప్రసాదం అరగించి 'మహానంది' - చూడాలని నంద్యాలకు బయలుదేరాం. కాని, అర్ధరాత్రికి బస్ నంద్యాలను చేరుకుంది. రాత్రులందు వూరిలోకి పోవడం మంచిది కాదని, అదే బస్‌లో తిరుపతికి బయలు దేరాం. తిరుపతిలో రెండు రోజులు వుండి అక్కడ నుండి రైలులో హైద్రాబాద్‌కు ప్రయాణమయ్యాం.



రైలులో కూర్చుని, "అయ్యో రాఘవేంద్రుని ఫోటో ఒకటి కొనుక్కొని రావలసింది. ఆ సంగతే మర్చిపోయామే! హైద్రాబాద్‌లో దొరికినా 'మంత్రాలయం' లో కొన్న దాని వేరుకదా! పిచ్చి వాళ్లలా యిద్దరం మర్చిపోయాము!" - అనుకుని బాధపడ్డాము. "పోనీ, మరో



సారి అయన్ని స్టేషన్‌లో నుంచయినా చూసి తృప్తిపడదాం, "మంత్రాలయం" స్టేషన్‌రాగానే నీకు మెలకువ వస్తే, నన్ను లేపు; నాకు మెలకువ వస్తే నిన్ను లేపుతా- అని యిద్దరం కలిసి దణ్ణం పెట్టుకుందాం!" అన్నారు - మావారు. నమ్మకం కుదిరితే - నాకన్నా నమ్మకం ఎక్కువ, భక్తీ ఎక్కువ మా వారికి! డిశెంబర్ నెల- అతి చలి మూలంగా హాయిగా నిద్రపోయాం ముగ్గురం! రెండు గంటలు కావస్తోంది. "లేవండి, యింకా మొద్దుల్లా పడుకున్నారేం? మీరు కోరుకున్న స్టేషన్ వచ్చింది. ఇక్కడ రైలు రెండు నిమిషాలకన్నా ఆగదు!" అంటూ యిద్దర్నీ ఎవరో తట్టి లేపినట్లు అయింది. ఇద్దరం చటుక్కున లేచి, యినపకిటికీ, అద్దం కిటికీ, తెరిచి చూశాము! ఎదురుగా "మంత్రాలయం" అనే బోర్డు కనిపించింది. దూరంగా ట్యూబులైట్ల వెలుగులో మందిరం కనిపించింది. దణ్ణం పెట్టుకుని, "మహిమాన్వితమైన మమ్మల్ని తరచు నీ సాన్నిధ్యానికి పిలిపించుకో స్వామీ!" అనుకున్నామో లేదో ట్రైన్ కదిలి, వేగాన్ని అందుకుంధి - ఊరునీ, స్వామినీ దూరంచేస్తూ. "మొద్దుల్లా పడుకున్నా చివరిగా యాత్రకోరిక తీర్చాలని తట్టిలేపాడు - ఆ మహానుభావుడు!" అని అనుకుంటూ పరవశిస్తూ ఆయన మాకు అడుగడుగునా యాత్రలలో చూపించిన మహిమలను వర్ణించుకుంటూ, యింక నిద్రపోకుండా ఆయన కబుర్లే చెప్పుకుంటూ కూర్చున్నాము. త్రీ టైర్ బెర్త్ అవటంవలన మా పక్కన ఒకాయన మాతోపాటే ప్రయాణిస్తూ వస్తున్నాడు. ఒక సూట్‌కేస్ ఒక చిన్న ప్లాస్టిక్ పేపర్ సంచి ఆయన వస్తువులు! స్టేషన్ రాగానే, ఆయన మాకన్నా ముందు సూట్‌కేస్ పట్టుకుని దిగిపోయాడు. పాపం! పైబెర్త్ మీద పడుకున్నాడుకదా! - ఆ పేపర్ సంచి పైబెర్త్ మీద మరచి వెళ్లిపోయాడు. "మన వస్తువులేమీ మర్చిపోలేదు కదా!" అని అనుకుంటూ, అన్ని బెర్త్‌లూ వెదికిన మా వారికి ఆ సంచీ దొరికింది. అందులో

విభూదిదండ, "సర్వసిద్ధి" యంత్రం - అని రాసున్న రక్షరేకు, "శ్రీ రాఘవేంద్రుని పంచముఖ ఆంజనేయస్వామివారితో వున్న ఫోటో, పటికిబెల్లం ప్యాకెట్ - ఉన్నాయి. "అయ్యో, పాపం ఆయనదే కదా ఈ సంచి! మర్చిపోయి వెళ్లిపోయి నట్లున్నారు. కనపడితే ఇచ్చేద్దాం!" అనుకుని రైలు దిగాం. ఎంత గాలించి చూచినా ఆయ నెవరో మాకు కనిపించలేదు. అంత జనంలో గుర్తు పట్టలేకపోయాం కూడా!

ఇంక చేసేదిలేక సంచిని యింటికి తెచ్చుకున్నాం. మా యాత్రా విషయాలను విన్న మా పెద్దలు - చిన్నలు ఆయన మహిమలకు చాలా ఆశ్చర్యపోయారు. "సహజంగా యిద్దరూ భయం, భక్తి కలవారు కాబట్టీ, అన్యథా భగవంతుడు మీకు అండగావుంటూ, తన మహిమలను చూపించాడు!" అన్నారు మా నాన్నగారు.

"తీర్థయాత్రలకు వెళ్తే, అక్కడనుంచి కొన్ని ముఖ్యమైన వస్తువులను కొనుక్కురావాలి. అలా మీరు తెలియకతెలేకపోయినా, శ్రీ రాఘవేంద్రుడు - అన్నీ ఆయన ఎవరిద్వారానైనా, పుట్టింటికి వచ్చి వెళ్లే ఆడపిల్లకు సర్ది యిచ్చినట్టుగా, అవన్నీ మీకు అందించారు. చాలా మహిమ చూపించారు - ఈ విషయంలో. "అయ్యో! ఫోటో అయినా కొనుక్కోలేదే!" అన్న మీ బాధా తీరింది!" అంది మా అమ్మ. ఈవిధంగా ఎన్నో మహిమలను నమ్మకంలేని మాలాంటివారికి కూడా తన మహిమద్వారా చూపించి, తన వశం చేసుకోవటమే - ఆయనలోని అద్భుతమైన మహిమ - అని చెప్పవచ్చు! నమ్మిన వారికి వెన్నంటివుండి తన మహిమలతో ఆదుకోవటం, కోరికలు తీర్చటంలో శ్రీరాఘవేంద్రునికి శ్రీరాఘవేంద్రులే సాటి!"

(ఇంకా వుంది.)

